క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ జయప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

వీరఘట్టం: మండల తహసీల్దార్‌గా కె.జయప్రకాష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్న టీడీ సత్యనారాయణ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఆర్‌ఐ లక్ష్మునాయుడు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సిబ్బందిని పరిచయం చేసుకుని, వారికి పలు సూచనలు చేశారు. రానున్న ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించిన డీటీ సత్యనారాయణను అభినందించారు.

ఫారెస్ట్ ఫైర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కిరణ్‌కుమార్

కురుపాం: అడవుల్లో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కురుపాం అడవీశాఖ బీట్ అధికారి ఎం.కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని పెల్లివలస, మంత్రజోల, మర్రిగూడ గిరిజన గ్రామాల్లో అగ్నిప్రమాదాలపై శనివారం అవగాహన కల్పించారు. పోడు వ్యవసాయ రైతులకు, గిరిజన గ్రామ ప్రజలకు అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలను వివరించారు. నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణ నష్టంతో పాటు వృక్షజాతి అంతరించి పోయే అవకాశం ఉందన్నారు.

తహసీల్దార్‌పై ఆరోపణలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న గౌరీశంకరరావు, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండల తహసీల్దార్‌గా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన జే రాములమ్మ సామాజిక మాధ్యమంలో తనపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు పలువురితో కలిసి శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సర్టిఫికెట్ మంజూరు కోసం లంచం అడిగారని ఆరోపించారు. తహసీల్దార్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ రాజేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, గిరిజనేతర, గిరిజన సంఘాల నాయకులున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

పాలకొండ: పట్టణంలోని పోలింగ్ బూత్‌లను ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, విద్యుత్, వెలుతురు, ర్యాంపులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలను బీఎల్‌ఓలు తరచూ పరిశీలన చేయాలని సూచించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గరుగుబిల్లి: వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగివుండాలని గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డా.ఎస్.సంతోస్‌కుమార్ అన్నారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పర్శలేని గోధుమరంగు మచ్చలు ఉంటే తక్షణమే వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానిక పీహెచ్‌సీలో కుష్టు వ్యాధికి ఉచితంగా చికిత్స, మందులు అందించనున్నట్లు చెప్పారు. వైద్యసిబ్బంది డి.మృత్యుంజయరావు, ఉదయ కుమారి, శ్రీదేవి, సింహాచలం పాల్గొన్నారు.

పక్కాగా ఇంటర్ ప్రాక్టికల్స్

సీతానగరం: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సుస్థిరాభివృద్ధి



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



ఆసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు

- మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం..
- ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టాలి
- ఆసరా సంబరాల్లో డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ పిలుపు
- వేల సంఖ్యలో తరలివచ్చిన అక్కచెల్లెళ్లు
- థ్యాంక్యూ సీఎం నినాదాలతో మార్మోగిన సభా ప్రాంగణం

వీరఘట్టం:

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో సంక్షేమం, సుస్థిరాభివృద్ధి సాధ్యమని, ప్రతీ మహిళ ఆర్థిక స్వావలంభన సాధించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పేర్కొన్నారు. మండల కేంద్రం వీరఘట్టంలో శనివారం 'వైఎస్సార్ ఆసరా' నాలుగో విడత సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ.. నాలుగో విడతగా మండలంలోని 1378 డ్వాక్రా సంఘాలలో ఉన్న 15,323 మంది మహిళలకు రూ.9.83 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. నాలుగేళ్లలో మొత్తం రూ.39.35 కోట్లు అందించినట్లు తెలిపారు. టీడీపీ పాలనలో సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, కానీ నేడు జగనన్న ప్రభుత్వంలో అర్హుల ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం జగన్‌కు పెరిగిన ప్రజాధరణను చూడలేక ప్రతిపక్ష నేతలు కుయుక్తులు పన్నుతున్నారని, అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్న రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. రాయల వారి పాలన గూర్చి చరిత్రలో తెలుసుకున్నామని, కానీ నేడు సీఎం జగన్ నేతృత్వంలో రాష్ట్రంలో స్వర్ణ యుగ పాలనను కళ్లారా చూస్తున్నామని అన్నారు.



సభా ప్రాంగణం వద్ద మహిళల కోలాటం

రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని కళ్లుండీ చూడలేని ధృతరాష్ట్రులు ప్రతిపక్ష నేతలని దుయ్యబట్టారు. వీరఘట్టం-వంగర మండలాలను అనుసంధానం చేస్తూ కిమ్మి-రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై వంతెనను పూర్తిచేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. రూ.5.50 కోట్లతో వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. ప్రతిపక్షాలు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే 2019 కంటే ఘోర పరాభవం తప్పదన్నారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

థ్యాంక్యూ జగనన్న..

ఆసరా సంబరాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. థ్యాంక్యూ సీఎం సార్.. థ్యాంక్యూ జగనన్న నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తింది. ఎమ్మెల్యే కళావతితో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు దివంగత సీఎం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోలాటం, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆసరా సంబరాలు సందడిగా సాగాయి. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, మహిళా కార్యదర్శి నల్లబిల్లి సుహాసిని, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, ఏపీఎం శివున్నాయుడు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

కురుపాం: ఎన్నికల విధుల నుంచి 58 సంవత్సరాలు దాటిన ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని ఏపీ ఎస్టీయూఎస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోమటిపల్లి త్రినాథరావు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 58 సంవత్సరాలు దాటిన ఉద్యోగులు వయోభారంతో ఇబ్బంది పడుతుంటారని, ఎన్నికల విధులు వారికి మరింత ఇబ్బందులకు గురిచేస్తాయన్నారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, బాలింతలకు ఎన్నికల విధుల నుంచి మినహాఇంపు ఇవ్వాలని కోరారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



నవగాం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న గ్రామాలను ఆదర్శవంతగా తీర్చిదిద్దగల సత్తా స్థానిక యువతకు ఉందని పాలకొండ ఎస్సై ఎన్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని నవగాం, పొట్లి గ్రామాలను శనివారం సందర్శించి స్థానిక యువత, గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమయ్యారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగేలా, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా సహకరించాలని కోరారు. మరికొద్ది రోజుల్లో సాధారణ ఎన్నికల నగారా మోగుతుందని, ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి తగాదాలు తలెత్తకుండా చూడాలని కోరారు.

ఆర్‌బీకేలతో రైతులకు మేలు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: రైతులందరికీ గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల్లో నుంచి పుట్టినవే రైతు భరోసా కేంద్రాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. రూ.21.80 లక్షల వ్యయంతో కత్తులకవిటిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శనివారం వారు ప్రారంభిచారు. ఈ ఏడాది శతశాతం ధాన్యం కొనుగోలు చేసి రైతులకు సంపూర్ణ మద్దతు ధర కల్పించిన కత్తులకవిటి ఆర్‌బీకే సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ జంపు కన్నతల్లి, సర్పంచ్ గేదెల సరోజనమ్మ, ఎంపీటీసీ కొత్తవలస పరిమల, మండల ఇంజినీరింగ్ అధికారి డి.కళ్యాణిదుర్గ, ఏఓ జె.సౌజన్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ జనార్దననాయుడు

గుమ్మలక్ష్మీపురం: శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే విజయాలను సొంతం చేసుకోవచ్చని ఎంఈఓ బి.జనార్దననాయుడు అన్నారు. మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల(బాలురు)లో ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్, నీడ్ సంస్థ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మానశిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తే, మానసిక ప్రసంత లభిస్తుందని, ఫలితంగా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. యస్ సొసైటీ నిర్వాహకుడు షేక్ గౌష్ మాట్లాడుతూ.. తీవ్ర ఒత్తిడి, మానసిక సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులు తమను సంప్రదించాలని, వారికి ఉచితంగా కౌన్సిలింగ్‌తో పాటు అవసరమైన మందులు అందించనున్నట్లు చెప్పారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



నిరుద్యోగ యువతకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు సచివాలయం పరిధిలో ఉన్న నిరుద్యోగ యువతకు అభిలాష ప్రోగ్రాంలో భాగంగా సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేరయ్యేలా ప్రతీ సచివాలయంలో జిల్లా కలెక్టర్ వారి సహకారంతో ప్రత్యేక లైబ్రరీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక వ్యక్తికి ఒక పుస్తకాన్ని వారం రోజుల పాటు ఇవ్వడం జరుగుతుందని, వాటిని తిరిగి అప్పగించి మరో పుస్తకాన్ని తీసుకువెళ్లవచ్చన్నారు. నిరుద్యోగ యువత అభిలాష లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్, సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు ఉన్నారు.

మజ్జిగ ద్రావణం పిచికారీతో ప్రయోజనం



మజ్జిగ ద్రావణం తయారీపై రైతులకు శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: పుల్లని మజ్జిగను నీటితో కలిపి జీడిమామిడి తోటల్లో పిచికారీ చేయడం వల్ల పూత, పిందె నిలబడడమే కాకుండా ఆకుమచ్చ, కాయమచ్చ, బూజు వంటి తెగుళ్లు దరిచేరవని జిల్లా ప్రకృతి వ్యవసాయం అసోసియేట్ (ఎన్‌ఎఫ్‌ఏ) జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని తాడికొండ గ్రామంలోని జీడిమామిడి రైతులకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తెగుళ్ల నివారణకు పుల్లటి మజ్జిగ ద్రావణం తయారీపై శనివారం ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఒక ఎకరా జీడిమామిడి తోటకు వంద లీటర్ల నీటికి ఆరు రోజులు పులియబెట్టిన ఆరు లీటర్ల పుల్లటి మజ్జిగను కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంటీ జి.నిర్మలాదేవి, సిబ్బంది ఢిల్లేశ్వరరావు, పరశురాం, వెంకటేష్ ఉన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆశ వర్కర్లు

పాలకొండ: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. అన్నవరం పీహెచ్‌సీ వద్ద శనివారం చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస వేతనాలు, గ్రూపు ఇన్సూరెన్స్, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఎం.ధనలక్ష్మి, కె.శాంతి, పి.శ్రీదేవి, టి.రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



వీరఘట్టం: తహసీల్దార్ రమణయ్యకు సంఘీభావం తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

వీరఘట్టం: విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సనపల రమణయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ జయప్రకాష్, రెవెన్యూ సిబ్బంది డిమాండ్ చేశారు. నిజాయితీగా పనిచేసే అధికారులపై ఇటువంటి దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఎం.సింహాచలం కోరారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం డివిజన్ అధ్యక్షుడు పొన్నాడ రఘునాయుడు, మండల అధ్యక్షుడు గేదెల అప్పలనాయుడు పాల్గొన్నారు.

సీతంపేట: తహసీల్దార్ రమణయ్య హత్యను ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల మండల సంఘం తీవ్రంగా ఖండించింది. హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని, రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధిక భూ వివాదాలు ఉన్న మండలాల తహసీల్దార్లకు, వీఆర్వోలకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరారు.

కురుపాం: బొండపల్లి మండల తహసీల్దార్ ఎస్.రమణయ్య హత్యకు నిరసనగా కురుపాం తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, కార్యాలయ సిబ్బంది శనివారం నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. రమణయ్య మృతికి సంతాపం తెలిపి నివాళులర్పించారు. ఉప తహసీల్దార్ నాగేశ్వరరావు, చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి: తహసీల్దార్ రమణయ్య హత్యకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని ఉప తహసీల్దార్ పి.ఎస్.లక్ష్మీకుమార్, రెవెన్యూ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కోరారు. మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు, ఆర్‌ఐ ఎం.కృష్ణ తదితరులున్నారు.



సీతంపేట: తహసీల్దార్ హత్యను ఖండిస్తున్న రెవెన్యూ సిబ్బంది



గరుగుబిల్లి: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న సిబ్బంది



కురుపాం: రమణయ్య మృతికి నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

'అభిలాష'తో నిరుద్యోగులకు మేలు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న 'అభిలాష' సామాజిక గ్రంథాలయాలతో నిరుద్యోగులకు ఎంతో మేలు చేకూరుతుందని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. కాశీపేట పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సామాజిక 'అభిలాష' గ్రంథాలయాన్ని మండల పరిషత్ కార్యాలయ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌తో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుద్యోగులు ఇటువంటి గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోందని చెప్పారు. జిల్లాలో మొదటిగా 66 రకాలకు చెందిన 12,804 పుస్తకాలతో 97 పంచాయతీ కార్యాలయాల్లో అభిలాష సామాజిక గ్రంథాలయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, డిజిటల్ సహాయకులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

జియ్యమ్మవలస: మండలంలోని పల్లపుసిరిపిలో వలంటీర్ తప్పిదం వల్ల నిలిచిపోయిన పింఛన్లను ఎంపీడీఓ శ్రీనివాసరావు సమక్షంలో శనివారం లబ్ధిదారులకు అందజేశారు. జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి గ్రామంలోని 29 మందికి పింఛన్లు అందజేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు.



జియ్యమ్మవలస: పల్లపుసిరిపిలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామానికి చెందిన కలిపిండి అప్పిశెట్టి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారుడు కావడంతో వలంటీర్ గడదేశి లక్ష్మి శనివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. అంతదూరం వెళ్లి పింఛన్ అందించిన వలంటీర్‌ను సర్పంచ్ మరడాన భాగ్యలక్ష్మి, గ్రామ పెద్దలు అభినందించారు.



గరుగుబిల్లి: అప్పిశెట్టికి పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ లక్ష్మి

తహసీల్దార్‌కు టీఆర్‌ఎఫ్ నేతల వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీఆర్‌ఎఫ్ నాయకులు

కురుపాం: మండలంలోని నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయొద్దని తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌ను ట్రైబల్ రైట్స్ ఫోరం(టీఆర్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండలంలోని మొండెంఖల్ గ్రామానికి సంబంధం లేని కొంతమంది వ్యక్తులు మన్నందొర కుల ధ్రువీకరణ పత్రం కోసం సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, వాళ్లు ఎస్టీ కాదని డీఎల్‌ఏసీ నిర్ధారణ చేసిందన్నారు. బీసీ కులానికి చెందినవారు కనుక కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయొద్దని కోరారు.